
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం, 7, మార్చి, 2024



సోమశిలలో 14.94 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 14.94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టా, వివిధ కాలువలకు 3,350 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.66,650
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,985
3శాతం జీఎస్టీతో	రూ.6,165
నవర (8గ్రా)	రూ.49,320

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.7 /24.6

బుధవారం గాలిలో తేమ 60 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. గురువారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

9న నెల్లూరుకు శివరాజ్‌సింగ్ చౌహాన్



మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

నెల్లూరు(మినీబైపాస్): మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ నగరానికి ఈ నెల తొమ్మిదిన రానున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. నగరంలోని వీఆర్సీ గ్రౌండ్స్‌లో కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర కమిటీలతో సమావేశం కానున్నారని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలం ప్రారంభం



కందుకూరు: కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో పొగాకు వేలాన్ని బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి సెక్రటరీ, వేలం మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడారు. బేళ్లను వేలం కేంద్రానికి తీసుకొచ్చే ముందు రోజు మార్కెట్‌కు విధిగా వచ్చి వేలాన్ని పరిశీలించాలని సూచించారు. దీన్ని బట్టే బేళ్లను తీసుకురావాలని కోరారు. పొగాకు బోర్డు సూచించిన క్లస్టర్ షెడ్యూల్ మేరకు బేళ్లను తీసుకురావాలని, వేలం కేంద్రం బయట కొనుగోళ్లు, విక్రయాలను చేయకూడదని చెప్పారు. కాగా రెండు కేంద్రాల్లో 18 బేళ్లను వేలంలో ఉంచగా, రూ.230 సగటు ధర వచ్చిందన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- జేసీ సేతు మాధవన్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న సేతు మాధవన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో రెవెన్యూ, రీ సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జేసీ సేతు మాధవన్ వెల్లడించారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో బాధ్యతలను బుధవారం చేపట్టారు. అనంతరం కలెక్టర్ హరినారాయణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ అసోసియేషన్ ఉద్యోగులు జేసీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

2020 బ్యాచ్ ఐఏఎస్ అధికారి

తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన సేతు మాధవన్ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. గతంలో ప్రకాశం జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా, మార్కాపురం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఎమ్మెస్సెమ్ఈ రాష్ట్ర శాఖలో సీఈఓగా పనిచేస్తూ జేసీగా ఇక్కడికి బదిలీ అయ్యారు.

అటెండర్లకు పదోన్నతులు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా రెవెన్యూ శాఖలో ఏడుగురు అటెండర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఉత్తర్వులను కలెక్టర్ హరినారాయణన్ జారీ చేశారు. వీరిని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసి ఉద్యోగోన్నతులను కల్పించారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..



భారీ ర్యాలీ నడుమ ప్రజలకు అభివాదం చేస్తున్న విజయసాయిరెడ్డి

జన నీరాజనం

విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం

- భారీ బైక్ ర్యాలీ, రోడ్ షోతో పండగ వాతావరణం
- జనసంద్రమైన నెల్లూరు
- పార్లమెంట్ నియోజకవర్గ నూతన కార్యాలయ ప్రారంభం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులయ్యాక తొలిసారి సింహపురికి బుధవారం వచ్చిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. జాతీయ రహదారి వద్ద అయ్యప్పగుడి సెంటర్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల మీదుగా రామ్మూర్తినగర్‌లోని నూతన కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ సాగింది. వేలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు విజయసాయిరెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు.

మహనీయుల విగ్రహాలకు నివాళి

కరెంటాఫీస్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్.. ట్రంక్‌రోడ్డులో గాంధీ, వైఎస్సార్.. ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి విజయసాయిరెడ్డి నివాళులర్పించారు.

ర్యాలీలో పాల్గొన్న అనిల్

నగరంలో విజయసాయిరెడ్డి చేపట్టిన రోడ్ షోలో నెల్లూరు నగర ఎమ్మెల్యే, పార్టీ నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. వీఆర్సీ సెంటర్ నుంచి రోడ్ షో ముందు నడుచుకుంటూ ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ వారిలో నూతనోత్సాహాన్ని నింపారు.

నూతన కార్యాలయ ప్రారంభం

రామ్మూర్తినగర్‌లో నూతన కార్యాలయాన్ని విజయసాయిరెడ్డి ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకుడు సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అశేష జనసందోహం మధ్య గుర్రపు రథంపై..



భారీ గజమాలతో సత్కారం

వెల్లువెత్తిన అభిమానం

- ఒంగోలు నుంచి నెల్లూరుకు ఉదయం బయల్దేరిన విజయసాయిరెడ్డికి జిల్లా సరిహద్దు ప్రాంతం ఉలవపాడు వద్ద ఘన స్వాగతం లభించింది. పార్టీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు గజమాలలతో సత్కరించారు.
- కావలి వద్ద ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కావలిలోని వీధుల మీదుగా వందలాది వాహనాలతో ర్యాలీని నిర్వహించారు.
- దగదర్తి మండలం ఉలవపాళ్ల వద్ద ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు.
- నార్తురాజుపాళెం వద్ద ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్వాగతం పలికారు.
- నెల్లూరు రూరల్ పరిధిలోని అయ్యప్పగుడి వద్ద పార్టీ నెల్లూరు రూరల్, నగర నియోజకవర్గ సమన్వయకర్తలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం పలికారు. అక్కడి నుంచి వేదాయపాళెం, కరెంటాఫీస్ సెంటర్, కొండాయపాళెం గేట్, కేవీఆర్ పెట్రోల్ బంక్, ఆర్టీసీ, వీఆర్సీ, గాంధీబొమ్మ, కనకమహల్, బోసుబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా రామ్మూర్తినగర్ వరకు వేలాది బైక్‌లతో ర్యాలీని జరిపారు. మేళతాళాలు, డీజే నృత్యాలతో పండగ వాతావరణం నెలకొంది.



నార్తురాజుపాళెం వద్ద స్వాగతం పలుకుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి



ఉలవపాళ్ల వద్ద విజయసాయిరెడ్డితో విక్రమ్‌రెడ్డి



కావలి వద్ద విజయసాయిరెడ్డితో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు

పెట్టుబడి రాయితీని సద్వినియోగం చేసుకోండి



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ తదితరులు

- కలెక్టర్ హరినారాయణన్
- రైతులకు రూ.2.65 కోట్ల మెగా చెక్కు అందజేత

నెల్లూరు(దర్గామిట్ట): తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు ప్రభుత్వమిచ్చిన పెట్టుబడి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. గతేడాది వర్షాభావం.. తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు రూ.2.65 కోట్ల మెగా చెక్కును కలెక్టరేట్లో బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉద్యాన పంటలు నష్టపోయిన 3,822 మంది రైతులకు రూ.2.32 కోట్లు.. వ్యవసాయ పంటలు దెబ్బతిన్న 425 మంది రైతులకు రూ.33 లక్షల పెట్టుబడి సాయాన్ని అందజేశామని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు నిరంజన్‌రెడ్డి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, రైతు సంఘ ప్రతినిధి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలి

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గానూ జిల్లాలో ఎంపిక చేసిన 16 నోడల్ బృందాలు ప్రత్యేక కార్యాచరణతో సమర్థంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియకు చేపడుతున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కార్యక్షేత్రంలో ఆర్వోలు, నోడల్ అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, పీఓలకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈఆర్వోలు, సెక్టార్ ఆఫీసర్లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఆదేశించారు. రోజువారీ నివేదికలను నిర్ణీత సమయానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను తప్పక పాటించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. జేసీ సేతు మాధవన్, కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, ఏఎస్పీ సౌజన్య, రిటర్నింగ్ అధికారులు మలోల, మధులత, శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నేత్రపర్వంగా పుష్పయాగం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి పుష్పయాగ మహోత్సవాన్ని నేత్రపర్వంగా బుధవారం నిర్వహించారు. దేవస్థానంలో అమ్మవారు కొలువుదీరి 49 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కార్యక్రమాన్ని జరిపారు. ఉభయకర్తలుగా సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విలువలతో కూడిన వైద్యసేవలందించాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ఘనంగా వైద్య కళాశాల స్నాతకోత్సవం



వైద్య విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న వెంకయ్యనాయుడు

నెల్లూరు(అర్బన్): వైద్యం వ్యాపారంగా మారుతున్న తరుణంలో నైతిక విలువలతో కూడిన వైద్య సేవలను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రోగులతో వైద్యులు ప్రేమపూర్వకంగా వ్యవహరించాలని కోరారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని రోగులకు నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు. కొత్తగా వైద్య వృత్తి చేపట్టేవారు గ్రామాలు, పట్టణాల్లోని మురికివాడలకు వెళ్లి ఆరోగ్యంపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటి వంటను మాత్రమే ఆహారంగా తీసుకోవాలని కాంక్షించారు. మాతృభాషను మరవొద్దని, అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో ఎంబీబీఎస్ లాంటి కోర్సులను సైతం మాతృభాషలోనే బోధిస్తున్నారని తెలిపారు. రాజకీయం, విద్య, వైద్యం ఆదర్శంగా ఉండాలని, అప్పుడే దేశం బాగుపడుతుందన్నారు.

ఇదే ఆస్పత్రిలో నా కుమార్తె జననం

తన కుమార్తె దీపా వెంకట్ ప్రభుత్వ డీఎస్సార్ ఆస్పత్రిలోనే జన్మించిందని వెంకయ్యనాయుడు తెలిపారు. మంచి వైద్యులు, సేవలు ఉండటంతో ప్రభుత్వాస్పత్రిని తాము ఎంచుకున్నామని చెప్పారు. ప్రస్తుతం మెడికల్ కళాశాలగా అభివృద్ధి చెందడంపై ఆనందం వ్యక్తం చేశారు.

అమెరికా వెళ్లినా పచ్చళ్లే తీసుకెళ్తా..

తాను అమెరికా వెళ్లినా పాత చింతకాయ, మినపప్పుల పచ్చళ్లనే తీసుకెళ్తానని తెలిపారు. మన ఆహారమే ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం వైద్య విద్యను పూర్తి చేసుకున్న 148 మంది విద్యార్థులకు పట్టాలను వెంకయ్యనాయుడు అందజేశారు. ప్రిన్సిపల్ వసుంధరాదేవి, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ఆర్టీఓ మలోల, ప్రొఫెసర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధి నిర్వహణలో అధ్యాపకుడి మృతి


కమల్‌హాసన్ (ఫైల్)

ఉదయగిరి/ మర్రిపాడు : ఉదయగిరి ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల డిపార్ట్‌మెంటల్ అధికారిగా(అధ్యాపకుడు) విధులు నిర్వహిస్తున్న పఠాన్ కమల్‌హాసన్ (43) గుండెపోటుకు గురై బుధవారం మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు పట్టణానికి చెందిన కమల్‌హాసన్ మర్రిపాడు జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 1 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఉదయగిరి ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి డిపార్ట్‌మెంటల్ అధికారిగా నియమించారు. ఈ క్రమంలో బుధవారం విధులకు హాజరైన ఆయన పరీక్ష కేంద్రంలో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యులు వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని బద్వేలుకు తరలించారు. కమల్‌హాసన్ మృతిపై పలువురు అధ్యాపకులు సంతాపం వెలిబుచ్చారు.

ప్రియుడు అనుమానిస్తున్నాడని..

- పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన మహిళ


చికిత్స పొందుతున్న మస్తాన్‌రెడ్డి

ఆత్మకూరు : ప్రియుడు అనుమానిస్తున్నాడనే కోపంతో అతన్ని హతమార్చాలని నిశ్చయించుకుంది. అందులో భాగంగా పెట్రోల్ పోసి నిప్పు అంటించింది. అయితే అతను తీవ్ర గాయాలతో బయటపడగా, ఆమె కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం దళితకాలనీలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ జి.వేణు వివరాల మేరకు.. అప్పారావుపాళెం దళితకాలనీకి చెందిన బొగ్గవరపు వజ్రమ్మను భర్త వదిలేయడంతో తొమ్మిదేళ్లుగా బేల్దారి పనులు చేసే మస్తాన్‌రెడ్డి అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో వారి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. ఆమెను అనుమానిస్తూ తరచూ గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో కడపలో ఉన్న మస్తాన్‌రెడ్డిని ఇంటికి రమ్మని పిలిచింది. బుధవారం ఉదయం అప్పారావుపాళెం చేరుకున్న మస్తాన్‌రెడ్డిని స్నానం చేసి రమ్మని బాత్‌రూమ్‌కు పంపింది. బయటి వైపు తాళం వేసి టవల్ ఇచ్చే నెపంతో బాత్‌రూమ్ తలుపుపై ఉన్న ఖాళీ స్థలం నుంచి అతనిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టింది. దీంతో మస్తాన్‌రెడ్డి బలంగా డోర్‌ను తోసి బయటికి వచ్చాడు. అప్పటికే మంటలతో తీవ్ర గాయాలైన అతను ఎదురుగా ఉన్న వజ్రమ్మ రెండో కుమార్తె నాగ లావణ్య (14)ను పట్టుకున్నాడు. దీంతో ఆమెకు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. దీంతో మస్తాన్‌రెడ్డిని వజ్రమ్మ దూరంగా నెట్టి గాయపడిన కుమార్తెను ఆత్మకూరు ఆస్పత్రికి తీసుకెళ్లింది. గ్రామస్తులు 108కు సమాచారం అందించడంతో వారు మస్తాన్‌రెడ్డిని ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మస్తాన్‌రెడ్డిని నెల్లూరుకు తరలించారు. కాగా వజ్రమ్మ కథనం మరోలా ఉంది. తాను కుమార్తెతో కలిసి దుస్తులు ఉతికి ఆరేస్తుండగా అప్పుడే వచ్చిన మస్తాన్‌రెడ్డి తానే అనుకుని కుమార్తెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడని, గమనించిన తాను అతన్ని నెట్టేసి కుమార్తెను ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు తెలిపింది. అతనికి ఎలా గాయాలైందని ప్రశ్నించగా తనకు తెలియదని చెబుతోంది. సీఐ జి.వేణు, ఎస్సై కె.ముత్యాలరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

10న ప్రవేశ పరీక్ష

పొదలకూరు (ముత్తుకూరు): ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్షలు ఈనెల 10వ తేదీన జరుగుతాయని ప్రిన్సిపల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఐదో తరగతి, మధ్యాహ్నం జూనియర్ ఇంటర్‌ల ప్రవేశ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 128
లేయర్ (లైవ్)	: 70
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 120

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.65
పండ్లు	: రూ.27

పేద కుటుంబాలకు 'ఆర్థిక చేయూత'

నేడు 'వైఎస్సార్ చేయూత' నగదు జమ
- గత మూడు విడతల్లో మహిళల ఖాతాల్లోకి రూ.602.12 కోట్లు
- జిల్లాలో 1,17,028 మందికి లబ్ధి



ఉదయగిరి : గత టీడీపీ ప్రభుత్వంలో మహిళల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండేది. పూట గడిచేందుకు పేదలు అనేక అవస్థలు పడేవారు. నాడు చేతిలో చిల్లిగవ్వలేని రోజుల నుంచి నేడు తమ కుటుంబాలను పోషించే స్థాయికి ఎంతో మంది మహిళలు చేరుకున్నారు. ప్రతి ఏటా జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి సొమ్ముతో స్వయం ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

బడుగుల జీవితాల్లో వెలుగులు

కొత్త జిల్లా పరిధిలో ఉన్న 37 మండలాల్లో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, పేద ఓసీ మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం వర్తింపజేస్తున్నారు. నేడు నాలుగో విడత చేయూత నిధులు విడుదల చేస్తున్నారు. జిల్లాలో నాలుగో విడతలో 1,17,028 మంది మహిళలకు రూ.219.43 కోట్ల నగదును మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ప్రభుత్వం తోడ్పాటు

వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు మద్దతుగా రిటైల్, వస్త్ర వ్యాపారం, అమూల్, హిందుస్థాన్, రియలన్స్ రిటైల్, అజియో బిజినెస్ వంటి బహుళ జాతి కంపెనీలతో ప్రభుత్వం భాగస్వామ్యం కుదుర్చుకుంది. వీటితో పాటు పశువుల పెంపకం, పాల సేకరణ, ఆరోగ్య సేవలు, కిరాణా దుకాణాలు, వస్త్ర షాపుల ఏర్పాటు, పండ్ల, కూరగాయల వ్యాపారం, జీవాల కొనుగోలుకు ఆర్థిక సాయం చేయడం ద్వారా చిన్న, మధ్య తరహా వ్యాపారాలు నడుపుకోవడానికి జీవనోపాధి మార్గాలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్విరామంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో జిల్లాలో లక్షలాది మంది పేదల జీవితాల్లో వెలుగులు నిండాయి. ముఖ్యంగా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అమలు చేస్తున్న 'వైఎస్సార్ చేయూత' పథకం ఎంతో మందికి స్వయం ఉపాధి చూపుతోంది. ఇప్పటి వరకు మూడు విడతలుగా ఇచ్చిన చేయూత సొమ్ముతో సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించే స్థాయికి చేరుకున్నారు. వడ్డీలకు అప్పు చేయకుండా ప్రభుత్వం ఇచ్చే సొమ్మును పెట్టుబడిగా పెట్టి వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

నిధుల విడుదలకు ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత నిధుల విడుదలకు ఏర్పాట్లు చేశాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బటన్‌నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు మూడు విడతల్లో నిధులు మహిళల ఖాతాల్లో జమ చేశాం. వీటి ద్వారా వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక భరోసా పొందుతున్నారు.
– సాంబశివారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

జిల్లాలో లబ్ధిపొందిన వారి వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారుల (2020-24)	నిధులు (లక్షల్లో)
ఆత్మకూరు	50,547	రూ.9515.19
కావలి	57,340	రూ.10751.27
కోవూరు	72,219	రూ.13541.07
నెల్లూరు సిటీ	67,403	రూ.12638.07
నెల్లూరు రూరల్	19,913	రూ.3733.07
సర్వేపల్లి	63,250	రూ.11859.39
ఉదయగిరి	50,653	రూ.9497.46
కందుకూరు	56,631	రూ.10618.27

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్) : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మహరాజ్‌గంజ్ జిల్లాకు చెందిన సంతోష్, నూర్‌హసన్ అన్సారి(19), ధృవపాసవాన్ ఉపాధి నిమిత్తం మూడు నెలల కిందట నెల్లూరు నగరానికి వచ్చారు. బీవీనగర్‌కు చెందిన కార్పెంటర్ మేస్త్రీ గురుమూర్తి వద్ద పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. గత కొద్ది రోజులుగా బీవీనగర్‌లో భరణికుమార్ ఇంటికి కార్పెంటర్ పనులు చేస్తున్నారు. ఈనెల ఐదో తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో మూడో అంతస్తులో సంతోష్ ఎలక్ట్రికల్ హ్యామర్‌తో గోడకు డ్రిల్లింగ్ వేస్తుండగా నూర్‌హసన్ అన్సారీ, ధృవపాసవాన్‌లు స్క్రూ, ఇతర వస్తువులు అందించసాగారు. కాగా కరెంట్‌వైర్‌కు జాయింట్ ఉండగా ఎవరూ గమనించలేదు. అన్సారీ కింద ఉన్న స్క్రూ తీసే క్రమంలో జాయింట్‌కు ఎడమచేయి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే సంతోష్, ధృవపాసవాన్‌లు జరిగిన విషయాన్ని తమ మేస్త్రీకి తెలియజేశారు. ఆయన సూచనల మేరకు నూర్‌హసన్ అన్సారీని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే యువకుడు మృతిచెందాడని నిర్ధారించారు. జరిగిన విషయాన్ని మృతుని కుటుంబసభ్యులకు తెలియజేశారు. బుధవారం తెల్లవారుజామున ఈమేరకు సంతోష్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సొంతగడ్డ రుణం తీర్చుకునేలా పనిచేస్తా

- జిల్లాకు ఎయిర్‌పోర్టును తీసుకొస్తాం
- నగరంలో ఇన్నర్ రింగ్‌రోడ్డుతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డును ఏర్పాటు చేస్తాం
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త విజయసాయిరెడ్డి


మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు సిటీ : 'తాను పుట్టింది, చదివింది నెల్లూరు జిల్లాలోనే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు నెల్లూరు ఎంపీగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు.. పుట్టిన జిల్లా రుణం తీర్చుకునేలా పనిచేస్తా' అని రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి తెలిపారు. చెముడుగుంటలోని ఫంక్షన్‌హాల్‌లో రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ తన సొంత జిల్లాకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను కలుపుకుని అభివృద్ధిపై దృష్టి సారిస్తామని తెలిపారు. జిల్లాలో రెండు పోర్టులు ఉన్నాయని, రోడ్డు కనెక్టివిటీ కూడా బాగుందని, అయితే ఎయిర్‌పోర్టు అవసరం ఉన్న నేపథ్యంలో కచ్చితంగా ఎన్నికల తర్వాత జిల్లాకు ఎయిర్‌పోర్టును తీసుకొస్తామని చెప్పారు. నెల్లూరులో ఇన్నర్ రింగ్‌రోడ్డుతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డును కూడా కచ్చితంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది సీట్లు వైఎస్సార్‌సీపీ గెలవడమే కాకుండా రాష్ట్రంలో 175 సీట్లలో విజయం సాధించడం తథ్యమన్నారు. రాష్ట్రంలో వైజాగ్, తిరుపతి కన్నా నెల్లూరును అభివృద్ధి చేస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తుంది – ఆదాల

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే మనల్ని గెలిపిస్తాయని రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్తగా వేణుంబాక విజయసాయిరెడ్డి రావడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. ప్రతి కార్యకర్త, నాయకులు సమన్వయం చేసుకుంటూ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిటీ ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత పర్మిషన్ తీసుకుని నెల్లూరుకు వస్తానని, అందరి లెక్కలు సరిచేస్తానని తెలిపారు. ఎంపీ ఆదాల రూరల్ సమన్వయకర్తగా వచ్చిన తర్వాత కుట్రలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైవీ రామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, రూరల్ ఎంపీపీ విజయకుమార్, పార్టీ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు గౌరీ, పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

నెల్లూరు(వేదాయపాళెం) : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏసీ నగర్‌లో ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు పర్వీన్ మాట్లాడుతూ ఉమెన్స్ డే వేడుకలను ప్రతిఏటా నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అపర్ణ, నలిని, భార్గవి, స్వర్ణ పాల్గొన్నారు.

ఇన్సురెన్స్ కంపెనీకి టోకరా

- రూ.కోట్లు కాజేసేందుకు యత్నం
- ఇద్దరు కేటుగాళ్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : ఫోర్జరీ సర్టిఫికెట్లతో ఇన్సురెన్స్ కంపెనీలో పాలసీలు చేయించి రూ.కోట్లు కాజేసేందుకు యత్నించిన ఇద్దరు కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్‌తో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. గూడూరు మాళవ్యనగర్‌కు చెందిన పి.శ్యామ్‌సుందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లాకు చెందిన వి.అంజయ్య స్నేహితులు. ఇద్దరూ కలిసి ఫోర్జరీ సర్టిఫికెట్లతో పాలసీలు చేయించి రూ.కోట్ల నగదు కాజేయాలని నిర్ణయించుకున్నారు. పాలసీ చేసేందుకు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ స్టేట్‌మెంట్, శాలరీ సర్టిఫికెట్‌లు ఉండాలి. ఈ క్రమంలో నిందితులు ఒకరి ఆధార్ అడ్రస్‌ను మరొకరి అడ్రస్‌గా చూపిస్తూ, నకిలీ శాలరీ సర్టిఫికెట్లను పొంది దానిపై నకిలీ బ్యాంకు ఖాతాలను సృష్టించి పాలసీబజార్ కంపెనీ ద్వారా ఓ ప్రముఖ ఇన్సురెన్స్ కంపెనీలో 14 మందిచే పాలసీలు చేయించారు. అందులో చనిపోయిన ముగ్గురు వ్యక్తుల పేర్లపై సైతం పాలసీలు కట్టించారు. ఇటీవల చనిపోయిన ఓ వ్యక్తికి చెందిన పాలసీని క్లెయిమ్ చేసేందుకు వీరు దరఖాస్తు చేయగా ఇన్సురెన్స్ కంపెనీవారు క్షుణ్ణంగా పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి కుటుంబసభ్యులు మరో ఇన్సురెన్స్ కంపెనీలో బీమా నగదు క్లయిమ్ చేసుకున్నట్లు ఈకేవైసీ ద్వారా వెలుగుచూసింది. దీంతో అనుమానం వచ్చిన ఇన్సురెన్స్ కంపెనీ వారు గతనెల 22న దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, ఎస్సై రమేష్‌బాబు సాంకేతికత ద్వారా కేసు దర్యాప్తు చేసి శ్యామ్‌సుందర్‌రెడ్డి, అజయ్‌లను బుధవారం బట్వాడిపాళెం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి వివిధ కంపెనీలకు చెందిన రబ్బర్‌స్టాంప్‌లు, ఏడు సిమ్‌కార్డులు, మూడు ఇన్సురెన్స్ బాండ్లు, పలు బ్యాంకు పాస్‌బుక్‌లు, పాన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలతో పాటు సిబ్బంది పెంచలయ్య, వేణు, ఖాజాలను డీఎస్పీ అభినందించారు. ఎస్సై బి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య

- జీజీహెచ్‌లో ఆలస్యంగా వెలుగులోకి..


తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న పెంచలయ్య

నెల్లూరు(క్రైమ్) : ఓ వృద్ధుడు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఎంతకీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో రెండో అంతస్తు నుంచి కిందకు దూకడంతో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ఆత్మకూరు మండలం కనుపూరుపల్లికి చెందిన పెంచలయ్య(63)కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల తీవ్ర కడుపునొప్పి, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా కుటుంబసభ్యులు ఆయన్ను ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం గతనెల 28వ తేదీన నెల్లూరు జీజీహెచ్‌లో చేర్పించారు. అప్పటి నుంచి రెండో అంతస్తులోని మేల్‌వార్డులో చికిత్స పొందుతున్నారు. ఆయనకు తోడుగా కుమారుడు రవీంద్ర ఉన్నారు. ఈనెల నాలుగో తేదీన రవీంద్ర డబ్బులు కోసం స్వగ్రామానికి వెళ్లారు. పెంచలయ్య ఒక్కడే ఆస్పత్రిలో ఉన్నాడు. అదేరోజు రాత్రి తీవ్ర కడుపునొప్పి రావడంతో విధుల్లో ఉన్న వైద్యసిబ్బంది ఆయనకు ఇంజక్షన్‌లు, సెలైన్ ఇచ్చారు. తాను ఊరెళ్తానని పెంచలయ్య వారితో చెప్పాడు. 5వ తేదీ ఉదయం పెంచలయ్య బెడ్‌పై లేకపోవడంతో వైద్య సిబ్బంది అతనికోసం గాలించారు. జాడ తెలియరాలేదు. ఈక్రమంలోనే పెంచలయ్య తన వార్డు పక్కనే ఉన్న మహిళల వార్డు కిటికీలో నుంచి కిందకు దూకాడు. అయితే దీనిని ఎవరూ గమనించలేదు. ఉదయం తీవ్రగాయాలతో రక్తస్రావమై అపస్మారక స్థితిలో ఉన్న పెంచలయ్యను సెక్యూరిటీ సిబ్బంది గమనించి ఐసీయూకు తరలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఐసీయూలో చికిత్స పొందుతూ పెంచలయ్య మృతిచెందారు. మృతుని కుమారుడు మంగళవారం రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ తన సిబ్బందితో హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఏఎస్సై వెంకటస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.